# కానుక



## మల్లాది వెంకటకృష్ణమూర్తి

**మనియార్డర్** ఏ దయినా వస్తే బాగుండునని ఎదురుచూస్తున్నాడు. ఆకలిగా ఉంది బాగా. ప్రఖ్యాత డిటెక్టివ్ నవలా రచయిత ధర్ ది గ్రేట్ పి. ధర్ వ్రాసిన ఏభై నవలలు, వంద కథలు నాలుగేళ్ళలో మంచి ఖ్యాతి తెచ్చిపెట్టడమే గాకుండా కొన్ని మలి ముద్రణ కూడా చూసాయి.

అలాంటి క్లాసిక్ కథా రచయిత ధర్‌కి బాగా ఆకలిగావుంది. కారణం అన్నం మొహం చూసి నాలుగు రోజులు దాటి అయిదోరోజు ప్రవేశించింది.

పదిరోజుల క్రితమే పబ్లిషర్స్ ఇచ్చిన తను వ్రాసిన నవలల, మేగ్‌జైన్స్ కాపీలు వందదాకా అమ్మేసాడు, ఫుట్‌పాత్ మీద సెకండ్‌హేండ్ పుస్తకాల వ్యాపారం చేసే ఓ కుర్రాడికి.

తనకి వచ్చిన ఆ కాంప్లిమెంటరీ కాపీలు అమ్మడం ఏమాత్రం ఇష్టం లేదు ధర్‌కి. తన రచనా ప్రతిభకి భౌతిక తార్కాణాలయిన వాటిని అమ్మక తప్పలేదు.

పుస్తకం పదిహేను పైసలు చొప్పున అమ్మేసాడు. తను బ్రతికి వుంటే ఆలాంటివి ఎన్నయినా రాయగలడు కాబట్టి, ఆ పుస్తకాలకన్నా తన ప్రాణాలు ముఖ్యం గనక ఆ పుస్తకాలకి వీడ్కోలుచెప్పి ఆకలి బాధను తీర్చుకున్నాడు.

మిగిలిన డబ్బుతో పబ్లిషర్స్ ఇద్దరు ముగ్గురుకు టెలిగ్రాంలు ఇచ్చాడు, చచ్చిపోతున్నాననీ, డబ్బు పంపమని. ఉత్తరాలు వ్రాసాడు, అయిదు నెలలక్రితం ప్రచురించిన ఆరు నవలలకీ, ఎనిమిది కథలకీ పారితోషికం అర్జెంటుగా పంపవమని, ఎక్స్‌ప్రెస్ డెలివరీ కవర్లలో.

ఎదురు చూడటం ప్రారంభించాడు డబ్బుకోసం. క్రితంరోజు, తిన్న ఒకటిన్నర బన్, ఆ నాటి నీళ్ళు తప్ప మరేమీ కడుపులో పడకపోవడంవల్ల బాగా నీరసంగా వుంది, శోష వచ్చేటట్టుగా. మంచి నీళ్ళు శక్తినిస్తాయా మరి!

దెప్పుతున్న మనసును కసిరి, ఈసారి ఏం అమ్ముదామా అని పెరిగిన గడ్డంతో ఆలోచిస్తూంటే, తన పక్క ఫ్లాటులో కాపరం వుండే కౌన్సిలర్‌గారబ్బాయి వచ్చాడు కొంచెం హడావిడిగా.

'ఏం సార్? కులాసా?' అడిగాడు ఆ కాలేజీ కుర్రాడు ధర్‌ని, అతని అవతారాన్ని చూసి.

కులాసా అన్నట్టుగా తలవూపి, ఆ కాలేజీ కుర్రాడికేసి చూసాడు ధర్ ఎందుకొచ్చావన్నట్టుగా. ఆ కుర్రాడు తన గదికి రావడం, వచ్చి అలా ఆప్యాయంగా పలకరించడం ఎప్పుడూ జరగలేదు కాబట్టి కొద్దిగా ఆశ్చర్యం వేసింది ధర్‌కి.

'సార్. మీరో చిన్న సహాయం చేసిపెట్టాలి.' ఆ కుర్రాడు బ్రతిమాలుతున్నట్టుగా అడిగాడు ధర్‌ని.

ఏమిటన్నట్టుగా చూసాడు ధర్.

మా కాలేజీ మేగ్‌జైన్‌కి ఓ క్రైం కథ వ్రాసిపెట్టాలి మీరు తప్పకుండా

కాద్దీగా వినయంగా అడిగాడు అతను.

ఇంతేనా అన్నట్లుగా, అభయం ఇస్తున్నట్లుగా, నవ్వుతూ చూసాడు ధర్ ఆకుర్రాడివంక.

'మంచి క్రైం కధయితే వేసుకుంటానని ఎడిటోరియల్ బోర్డులోని ఒకతను చెప్పాడు నాతో.'

'అలాగే' అన్నాడు ధర్.

'రేపు సాయింత్రంలోగా వ్రాసివ్వాలి దయచేసి.' అర్థిస్తున్నట్లుగా అడిగాడు అతను.

'వ్రాసిస్తాను కాని...'

'ఆగిపోయారే?'

'వుండండి ఒక్కక్షణం' అని 'ధర్ నేను చెప్పేదికూడా విను' అన్న మనసుని అడిగాడు. 'ఏమిటి?' అని.

'లోగడ యితనిదగ్గర తీసుకున్న డబ్బు చెల్లు పెట్టించు' హెచ్చరించింది మనసు.

'ఏంలేదు. ఇదివరకు మీవద్ద పుచ్చుకున్న పదో, పదిహేనో దీనికి చెల్లు పెట్టండి దయచేసి. నాకధకి ఎడిటర్ పాతిక తక్కువలేకుండా ఇస్తారు. అదయినా మీకనే.'

'అలాగే' అన్నాడు అతను అ డబ్బుమీద ఎప్పుడో ఆశ వదలుకోవడంవల్ల.

'ఆకలి' అరిచింది మనసు.

'హోటల్కి వెళదాం వెంటనే' అన్నాడు ధర్.

'ఇప్పుడా?'

'ఏంలేదు. కాస్త వేడివేడిస్ట్రాంగ్ కాఫీ పడితే కలం కదును తొక్కే కొత్త గుర్రంలా దౌడు తీస్తుంది. అంతే.'

'పదండిమరి'

అతను వినుగు బయటికి కనపడనీయలేదు.

'నక్కతోక తొక్కేవ్ ఇవాళ' అన్నది మనసు.

ధర్ తన అనుకోని అదృష్టానికి సంతోష పడుతూ చొక్కా తొడుక్కుని, చెప్పులులేని కాళ్ళతో ఆ కాలేజీకుర్రాడి వెంట నడిచాడు.

'ధర్, నువు ఈ కుర్రాడిని జాగ్రత్తగా వాడుకోవాలి సుమా' హెచ్చరించింది మనసు.

'నాకు తెలియదనుకున్నావా? నువు కాసేపు నోరుమూసుకో' కసిరాడు కవి మనసుని.

'మరి తెలుస్తే బావి పబ్లికేషన్స్ నుంచి నువు వ్రాసిన కథలకి, నవలలకి రెమ్యూనరేషన్ సంపాదించుకోలేదే?' ప్రశ్నించింది.

'నువు కల్పించుకోకు ఈ విషయంలో. త్వరలో చాలా పంపుతాను నీకు. గప్ చిప్ గా వుండు.'

'ఈసారి నుయ్యిలో తగలడు. నాకెందుకు.'

ఓ ఏర్ కండిషన్డ్ హోటల్‌లోకి దారి తీశారు ఇద్దరూ. సర్వర్ రాగానే 'రెండు కాఫీ' అన్నాడు కాలేజీ కుర్రాడు, ధర్‌ని సంప్రదించకుండానే.

ధర్ మనసు వూరుకోలేదు. చెవి పిండి, నెత్తిమీద రెండు మొట్టికాయలువేసి అరిచి గోల చేసింది ధర్ పోతున్న సర్వర్‌ని పిల్చేదాకా.

ధర్ సర్వర్‌ని పిలచి, 'ఇడ్లీ వడ, గారె, ఎం. ఎల్. ఏ పెసరట్, బజ్జీ, దోసె, రసగుల్లా, మజ్జిగ త్వరగా తీసుకురా కాఫీతో పాటు' అన్నాడు గట్టిగా.

'అవన్నీ నాకే?' అడిగాడు కాలేజీ కుర్రాడు ఖంగారుగా.

ధర్ లేని సీరియస్‌నెస్ ముఖాన పులుముకుని, కుడిచేతి చూపుడు వ్రేలితో లయగా టేబిల్ మీద కొడుతూ, ఆ కుర్రాడి మాటలు పట్టించుకోనట్లుగా గొణిగాడు.

'హత్య....హంతకుడు.... అశ.... పోలీస్ ఇన్‌స్పెక్టర్ .... అల్.... స్పెక్లర్ ....విషం....క్లూ.'

ఆ కాలేజీ కుర్రాడు వచ్చే కోపాన్ని మ్రింగుకుని మొహం ఇబ్బందిగా పెట్టాడు.

'తెలివి నేర్చావ్' అన్నది మనసు.

అయిదు నిముషాల తర్వాత సర్వర్ మరో ఇద్దరు సర్వర్‌ల సహాయంతో, నాలుగు ట్రేలలోని ప్లేట్సు సద్దాడు రెండు టేబిల్స్‌మీద, పట్టక ప్రక్కనే ఖాళీగావున్న మరో రెండు టేబిల్స్ జత చేసి అమర్చాడు పదార్థాలు.

'బజ్జీ తేలేదేమని అడుగు ధర్' మనసు చెప్పింది టేబిల్స్‌మీద ప్లేట్స్‌ని పరిశీలించి.

'నేను తినను. అయనవిమాత్రం వుంచి మిగతావి తీసుకెళ్లు' చెప్పాడు కాలేజీ కుర్రాడు.

'ఫర్వా లేదు. తెచ్చిన తర్వాత తీసుకువెళ్ళితే బాగుండదు. వుంచులే. పోతే బజ్జీ మర్చిపోయావు. అది మాత్రం ఒక్క ప్లేట్ త్వరగా తీసుకు రామ్మా' అన్నాడు ధర్ సర్వర్‌తో.

తనవంక కృతజ్ఞతజేసి చూస్తున్న ఆ కాలేజీ కుర్రాడివంక చూడనైనా చూడకుండా గబగబా ఆ ప్లేట్‌లమీద పడ్డాడు ధర్.

'నేర్చావు మొత్తానికి' అన్నది మనసు. కడుపునిండా తిన్నాడు ధర్ అరగంటసేపు నీరుకి ఎక్సర్‌సైజ్ నిచ్చి, ఎటూ చూడకుండా.

'మన గదికి పోదాం' అన్నాడు లేచి, కడుపుచేత్తో తడుముకుంటూ.

'ఊఁ!'

పదహారు రూపాయల చిల్లరకి వచ్చింది బిల్. ధర్ అతనితోబాటు కౌంటర్ దగ్గర ఆగకుండా, చాక్కా

అంతటితో మూతి తుడుచుకుంటూ బయటికి నడిచాడు.

'వక్కపొడి మరి?' మారాం చేసింది మనసు.

'బావుండదు' గొణిగాడు ధర్.

'ఛీ నీకెప్పుడూ మొహమాటమే సిగరెట్ కూడా అడుగు' గర్జించింది.

'మాడు తాసిల్దారుగారబ్బాయ్! నీ పేరేమిటో మర్చిపోయాను గాని కొంచెం వక్కపొడితీసుకో. బర్కిలీ చాలులే. చిల్లర ఇంటిదగ్గర మరో చొక్కా జేబులో మర్చొచ్చాను' అన్నాడు ధర్ హోటల్ లోంచి బయటికి వచ్చిన అతనితో.

'నా దగ్గర లేదు చిల్లర'

మొహం మాడ్చుకుని ఈసడింపుగా అన్నాడు అకుర్రాడు ధర్ ని అసహ్యంగా చూస్తూ.

'ఛీ. చూడు ఎలా బిచ్చగాడిని చూసినట్లుచూస్తున్నాడో. నీది రిమ్మ తెగులు' కసిరాడు ధర్ మనసుని, సిగ్గుతో చచ్చిపోతూ.

'ప్చ్! నాకు కలం నడవదోయ్ వక్కపొడి లేకపోతే'

ఉలిక్కిపడ్డాడు ధర్ తన కంఠ స్వరం విని. 'నేనేలే' సమాధాన పర్చింది మనసు ధర్ ని.

'నా పరువు తీసేస్తున్నావ్. ఛీ. ఎందులోనయినా పడి చావ....'

'డిటెక్టివ్ కథారచయితకి పదు పెక్కడేడిసింది ఆంధ్రదేశంలో' మనను మధ్యలోనే ధర్ నోరు మూయించింది.

'వగలు, టెక్కులు నేర్చావ్' మండిపడ్డాడు ధర్ వక్కపొడి నములుతూ.

'నువ్వూరుకోస్'

'ఎందుకూరుకోవాలి?'

మౌనం వహించింది మనసు.

'మాట్లాడవేం? నువు కుక్కవి, నక్కవి, పందివి'

మౌనం....

'అరెరె' అన్నాడు తాసిల్దారుగారబ్బాయ్ గబుక్కున ఆగిపోయి, జేబులు తడుముకుంటూ.

'ఏమయింది?' అని అడిగాడు ధర్ అతన్ని.

'ఇరవై రూపాయల నోటు ఇచ్చి మిగిలిన నాలుగు తీసుకోవటం మర్చిపోయ్యాను.

'అరెరె.'

'అయ్యో. మర్చిపొయ్యాను తీసుకోవడం' అన్నాడు మళ్ళీ.

'అడుగుదాం పదండి'

ఇద్దరూ వెనక్కితిరిగి హోటల్ కేష్ కౌంటర్ లో కూర్చునివున్న బొండాంముందు ఆగారు.

'ఇవ్వండి' అన్నాడు ధర్.

'ఏమిటి?' బొండాం అడిగాడు.

'ఇప్పుడే ఇరవై రూపాయలనోటు,

ముప్ఫైఅయిదు పైసలు, బిర్ ఇచ్చాను తిరిగి నాలుగు తీసుకో లేదు' అన్నాడు కుర్రాడు.

'నాలుగు ఇవ్వండి' అన్నాడు ధర్.

'ఇచ్చాను బొండాం' అన్నాడు.

'ఇవ్వలేదు'

'కావాలంటే మీ బిల్స్ మొత్తం, వసూలయిన డబ్బు లెక్క చూడండి. నాలుగు ఎక్కువ వుంటుంది మీ గల్లాపెట్టెలో'

'వూహూ. ఇచ్చేస్తాను.'

అయిదు నిముషాల ఘర్షణతర్వాత వట్టిచేతులు వూపుకుంటూ ఇంటిదారి పట్టారు ఇద్దరూ, బాధపడుతున్న ఆ కుర్రాడితో అన్నాడు ధర్.

'డబ్బు పాపిష్టిదోయ్ బాధ పడకు.'

'డబ్బుకాదు. మనుషులు కూడా పాపిష్టివాళ్ళు. అసలు నాది బుద్ధి తక్కువ'

కిక్కురుమనలేదు ధర్.

ఇంటికివెళ్ళాక అన్నాడు కాలేజీ విద్యార్థి.

'మీరు వ్రాస్తారా? నన్ను వ్రాయ మంటారా మీరు చెప్తూంటే?'

'ఏమిటి?'

'కథ'

'ఇప్పుడేమిటోయ్ కథ? సాయంత్రం వ్రాసుకుందాం. నిద్రొస్తోంది.'

తన కంఠస్వరం మళ్ళీవిని ఈసారి అబ్బురపడలేదు. అబద్ధాలాడితే నిన్ను సున్నం కుండలోపెట్టి పాతే స్తాను' అరిచాడు.

'సాయంత్రం కథ వ్రాయకపోతే పూరుకునేదిలేదు' విసురుగా వెళ్ళి పోయాడు కుర్రాడు.

కంచన్‌గా అరున్నరకి వచ్చాడు ఆ కుర్రాడు బూట్లు టకటిక లాడిం చుకుంటూ.

'ఇప్పుడు గడ్డం గీసుకుంటు న్నారా?' అడిగాడు అద్దంముందు నిలబడి గడ్డానికి సబ్బు రుద్దుతున్న ధర్‌ని.

'అవును. గడ్డం గీసుకోడానికి నాకు ఏడు నిముషాలకంటె ఎక్కువ పట్టదు. కులాసానా? కూర్చోండి.'

'కూర్చోడానికి రాలేదు. కథ సంగతి ఏమైంది?'

'క్రైంకథా?'

'అవును. క్రైం కథ.'

'వ్రాసేద్దాం.'

'ఇంకా ఎప్పుడు?'

ధర్ భారత్ బ్లేడ్‌తో సరిగ్గా ఏడు నిముషాలలో గడ్డం గీసుకోవ డం ముగించి, తొమ్మిదో నిము షంలో అమ్ముదామనుకుంటున్న చల వచేసిన బట్టలతో తయారయ్యాడు

'పోదాం పదండి' అన్నాడు తాసిల్దారుగారబ్బాయితో.

'ఎక్కడికి' అడిగాడు అతను.

'చెప్తాగా. పదండి'

ఇద్దరూ రోడ్డు మీద నడుస్తున్నారు.

'ఎక్కడికి?' అడిగింది మనసు.

'నీ కనవసరం.'

'చెప్పు చెప్పు. ఎక్కడికి?'

'చూస్తూండు. లాగక.'

పుదయం వెళ్ళిన హోటల్ లోకి దారి తీసారు ఇద్దరూ.

'నాదగ్గర ఇంక డబ్బులేదు' అవమానంగా అన్నాడు ఆ కాలేజీ విద్యార్థి.

'వున్నా దాచుకోండి. ఈసారి నావంతు.'

కొద్దిగా కోపం తగ్గింది ఆకు ర్రాడికి.

'ఏమిటి?' అడిగింది మనసు.

సర్వర్ కి ఓ పెద్ద లిస్టు చెప్పాడు ధర్.

'ఏమిటి? నీదగ్గర డబ్బుందా?' మనసు.

'లేదు. వుంది' ధర్.

'ఏమిట్రా తిక్కసమాధానం? నీకు మతిపోయిందా? ఎలా ఇస్తావ్ బిల్?'

మౌనం.

'నిన్నే. లే. లేచి వెళ్ళిపో. బిల్ ఈసారి ఇతని వ్వకపోతే అనవసరంగా నువు పిండి రుబ్బాల్సొస్తుంది.'

మౌనం.....

'ఏమిటలా మొద్దులా కూర్చున్నావ్? నిన్నే.'

మౌనం.....

'సరే. నామాట వినకపోతే నీ ఖర్మ నీవు అనుభవించు.'

ఇద్దరూ సుష్టుగా తిన్నారు.

పద్దెనిమిది రూపాయ లయింది బిల్ సరిగ్గా ఇద్దరికీ కలిసి.

'పోదామా?' అడిగాడు ధర్ బిల్ అందుకుని.

తలూపాడు ఆ కాలేజీకుర్రాడు. ఇప్పుడు అతని మొహం చాలా ప్రసన్నంగా మారింది. ధర్ బిల్ తీసుకోవడంవల్ల.

అతను కొంచెం ముందు గబగబ నడిచి కిళ్ళీకొట్టుదగ్గర ఆగి, పక్క పొడి, సిగరెట్ ప్యాకెట్ కొన్నాడు ధర్ కోసం. తాపీగావచ్చాడు ధర్.

ఇద్దరూ ధర్ గదికి చేరుకున్నారు.

'కథ వ్రాస్తారా ఇక?' అడిగాడు అతను ధర్ వంక గౌరవంగా చూస్తూ.

'మీరేమీ అనుకోకపోతే ఓ చిన్న మాట'

'అడగండి.'

'ఓ ఫైవ్. మొదలు పెడతాను కథ వెంటనే'

'మళ్ళీ ఇస్తారా?'

'తప్పకుండా'

'టూ వుంది. అంతే.'

'త్రీతో కలిపితే ఫైవ్ అవుతుంది'

'అవును. అవుతుంది. అలాగే'

ధర్ లేచి ఓ తెల్లకాగితం అందుకుని దాన్ని ఆ కుర్రాడికి ఇచ్చాడు వ్రాయమన్నట్లుగా. అతను పెన్ తీసి పట్టుకున్నాడు సిద్ధంగా.

అర్ధరాత్రి. అమావాశ్య, కటిక చీకటి లాంటి పదాలతో మొదలవుతుందీ అనుకున్నాడు గధ. కాని అలా మొదలవలేదు.

'ప్రియమైన మరియు పూజ్యులైన బొండాంగారికి నమస్సులతో కష్టమర్ వ్రాయు విన్నపములు ఏమనగా....'

'ఇదేమిటి?' అడిగాడు కుర్రాడు.

'వ్రాయండి పూర్తిగా. మధ్యలో నన్ను డిస్టర్బ్ చేయొద్దు.'

'ఏమిటి?' మనసు అడిగింది మళ్లీ.

'కుర్రాడి కథ చెప్పడంలేదు నువు?'

అదేమీ పట్టించుకోకుండా చెప్పుకుపోయాడు ధర్.

'ఇవాళ వుదయం మీ హోటల్లో చిన్న నేరం జరిగింది. నా స్నేహితుడు, ఓ తాసిల్దారు గారబ్బాయిని మోసం చేసి నాలుగు రూపాయలు కొట్టేసారు మీరు, కుర్రాడినిచేసి'

'నాపేరెందుకు? కథ కావాలి. వుత్తరంకాదు.'

'వ్రాయండి మాట్లాడక. ఎంత దాకా వచ్చాను? ఆ. మీరు అలా చేయటం నాకెంతమాత్రం నచ్చలేదు. ఓ క్రైం రచయిత ముందు అంత ఘోరం జరిగితే భరించలేదు. అందుకని నేను మీకు బుద్ధి చెప్పదలచుకున్నాను.

గంటన్నరక్రితం మీ హోటల్లో సదరు తహసిల్దారు గారబ్బాయితో పద్దెనిమిది రూపాయల సరకు తిని, బిల్ చెల్లించకుండా బయటికి వచ్చేసాను. పైన చెప్పబడిన సదరు బిల్లు ఈ వుత్తరానికి జతపర్చబడింది....

పద్దెనిమిది, నాలుగు, వెరసి పధ్నాలుగు రూపాయలు మాకు లాభం. మీకు నష్టంకాదు. ఫైన్, పెనాల్టీ. గుర్తుంచుకోండి. క్రైం నెవర్ పేస్, జస్టులైక్ క్రైంస్టోరీస్. ఇకమీద బుద్ధిగా మెలగగలవారు.

కృతజ్ఞతతో,

మీ విధేయుడు

ధర్.

షరా. కుక్క కాటుకు చెప్పుదెబ్బ, ముల్లును ముల్లుతోనే. వజ్రాన్ని వజ్రమే కోస్తుంది, టిట్ ఫర్ టాట్, తప్పుచేసి తప్పించుకోలేవు, న్యాయానికి నిముషంచాలు, వగైరా వగైరా కథల రచయిత.'

ధర్ ఓసారి నూట అరవైనాలుగో పేజీలో విజయం పొందిన డిటెక్టివ్ లాగా గర్వంగా నవ్వాడు, సంభ్రమంతో చూస్తున్న ఆ కుర్రాడి వంక. తర్వాత జేబులోంచి తాపీగా తను చెల్లించని పద్దెమిది రూపాయల బిల్ తీసి, అతని కందిచ్చి అవుత్తరానికి గుచ్చమనాడు.

'కధ?' అడిగాడు అతను.

'ఇంకాకధేమిటని అడుగుతారేమండి? మనం హోటల్ లోకి వెళ్ళినది అదిగా ఈ ఉత్తరం దాకా కలిపి వ్రాస్తే అదో క్రైం కధయి కూర్చుంటుంది. వ్రాసి తీసుకురండి' దిద్దుతాను. తర్వాత దీన్ని ఆ బొండాంకి పోష్టులో పంపండి తప్పకుండా.'

'ఇదేం క్రైం కధ? ఓ హత్య లేదు. ఓ పరిశోధనలేదు. ఓ డిటెక్టివ్ కానీ, పోలీస్ ఇన్స్పెక్టరుకానీ లేదు' అసంతృప్తిగా అన్నాడు ఆ కాలేజీ కుర్రాడు.

'ఇప్పుడు అవేవీ లేకుండా కధ వ్రాయడమే ఫేషన్' అన్నాడు ధర్.

అతను వెళ్తూంటే గుర్తుచేసింది ధరర్కి మనసు.

'ఫైల్'

'ఫైల్ సంగతి మర్చిపోకండి' అరిచాడు ధర్.

'సెభాష్' మెచ్చుకుంది మనసు.

'ఆంధ్రదేశంలో డిటెక్టివ్ కధా రచయితంటే ఏమనుకున్నావు? తప్పు అంచనావేయకు ఇంకెప్పుడూ. ధర్ మందలించాడు మనసుని.

